
సాక్షి వరంగల్

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



పీహెచ్‌డీ అడ్మిషన్లు షురూ

కాకతీయ యూనివర్సిటీలోని సోషల్ సైన్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్ట్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. - 8లో▸



గంజాయి విక్రయదారుల అరెస్ట్

జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పర్వతగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సేవాభావం కలిగి ఉండడం అభినందనీయం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వర్ధన్నపేట: సేవాభావం కలిగి ఉండడం ఎంతో అభినందనీయమని, కంటి పరీక్షలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శంకర నేత్రాలయ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నాట్య జ్యోతి కూచిపూడి డ్యాన్స్ వారి సహకారంతో వర్ధన్నపేటలో పది రోజులుగా కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారంతో ముగిసింది. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వైద్య శిబిరం విజయవంతానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శిబిరానికి సహకరించిన వారితోపాటు నిర్వాహకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావు, ఐఎంఏ అధ్యక్షుడు కాశీప్రసాద్, డాక్టర్ స్వర్ణలత, రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిరం ఆర్గనైజర్ కోరె చంద్రమౌళి, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, నాయకులు అబ్బిడి రాజిరెడ్డి, ఎద్దు సత్యనారాయణ, శంకర నేత్రాలయ వైద్యశాల అధినేతలు, ఆర్గనైజర్లు, నాట్యజ్యోతి కూచిపూడి డ్యాన్స్ సంస్థల అధినేతలు, ఆర్గనైజర్లు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



ఎంజీఎం : ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా.. సోమవారం జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోగ్రాం అధికారులు సందర్శించారు. ఆస్పత్రుల్లో జ్వరాలు నమోదవుతున్న తీరు.. ఎంతమందికి అడ్మిషన్ అవసరం.. ప్లేట్‌లెట్స్ సంఖ్య లక్షలోపు ఉన్న వారి సంఖ్య, వ్యాధి నిర్ధారణ పరీక్షల తీరును ఆమె సమీక్షించారు. ర్యాపిడ్ కిట్‌లో పాజిటివ్ వచ్చిన నమూనాలు ఎంజీఎం ల్యాబ్‌కు పంపించాలని, అలాగే ఇన్ పేషెంట్ సదుపాయమున్న ఆస్పత్రులు ప్రతీ రోజు నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు సమర్పించాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 28 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, మలేరియా పాజిటివ్ కేసులు లేవని వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఇన్‌చార్జ్ ఇఫ్తేఖార్ అహ్మద్, ఎంహెచ్ఎన్ ఇన్‌చార్జ్ పీఓ డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి మూడేళ్ల లా సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు విద్యార్థులకు నాల్గవ సెమిస్టర్(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్ నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నాగరాజు తెలిపారు. ఈనెల 20, 22, 24, 27, 29 తేదీల్లో లా పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

'లా' ఎనిమిదో సెమిస్టర్ పరీక్షలు

కేయూ ఐదేళ్ల లాకోర్సు ఎనిమిదో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పైన తెలిపిన తేదీలు, సమయాల్లోనే ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

వరంగల్ ఎఫ్ఏసీ డీఈఓగా జ్ఞానేశ్వర్



విద్యారణ్యపురి: వరంగల్ ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) డీఈఓగా ఎం.జ్ఞానేశ్వర్‌ను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్ నుంచి ఇటీవలే జ్ఞానేశ్వర్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా బదిలీపై వచ్చారు. కొన్నేళ్లుగా వరంగల్ ఎఫ్ఏసీ డీఈఓగా కొనసాగుతున్న డిప్యూటీ డీఈఓ డి.వాసంతిని హనుమకొండ ఎఫ్ఏసీ డీఈఓగా కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ ఎఫ్ఏసీ డీఈఓగా విధులను నిర్వర్తించిన ఎండీ.అబ్దుల్‌హై అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లిన విషయం విదితమే.



- ఈ చిత్రంలో కనిపిస్తున్నది నెక్కొండ మండలం చంద్రుగొండ చెరువు. నీళ్ల లేక ఆయకట్టులోని సుమారు 500 ఎకరాల్లో ఇంకా నాట్లు వేయలేదు. 450 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువులోకి నీళ్లు వస్తాయా లేదా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈచెరువు కింద చంద్రుగొండ, గొల్లపల్లి, గేటుపల్లి, మూడు తండా, నెక్కొండ, అమీన్‌పేట, చింత నెక్కొండ రైతులు ఆధారపడ్డారు. కొందరు రైతులు బంజరపల్లి నుంచి వచ్చే సీతారాంపురం మాటు ద్వారా నారు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు ఈ చెరువులోకి 35 శాతం మాత్రమే నీళ్లు వచ్చాయి.



- ఈ ఫొటోలోనిది సంగెం మండల కేంద్రంలోని ఊర చెరువు. దీని ఆయకట్టు 140 ఎకరాలు. చెరువులో నీటి సామర్థ్యం 9.250 మిలియన్ క్యూబిక్ ఫీట్ (ఎంసీఎఫ్‌టీ)లు. ఆశించిన వర్షాలు కురవక కేవలం 1.250 ఎంసీఎఫ్‌టీ నీరు మాత్రమే చెరువులోకి వచ్చింది. రైతులు వరి నారు పోసుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకా నాట్లు వేయలేదు. ఈ చెరువులోకి ఎస్సారెస్పీ కెనాల్ నుంచి నీరు రావడానికి తూము ఏర్పాటు చేయలేదు. ఎస్సారెస్పీ కెనాల్‌లోకి కూడా నీరు రావడం లేదు. వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వరి నాట్లు ఆలస్యమయ్యాయి.



- ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెన్నారావుపేట మండలం కోపాకుల గ్రామ చెరువు. ఈసారి వర్షాల కారణంగా చెరువులోకి నీరు పెద్దగా చేరలేదు. చెరువు సామర్థ్యం 11 ఫీట్లు అయితే.. ప్రస్తుతం నాలుగు ఫీట్ల వరకే నీరు ఉంది. చెరువు కింద ఆయకట్టు 490 ఎకరాల్లో వరి సాగవుతోంది. సుమారు 450కి పైగా ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అయితే.. ఈ చెరువులో ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నీరు చేరకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులు నారు పోసుకొని వర్షాలు లేక బీడు భూములుగా వదిలేశారు.

చెరువు కింద సాగు వర్రీనే!

ఇప్పటికీ.. నాట్లు వేయని చాలా మంది రైతులు

- ఆశించిన వర్షం లేక చెరువులు వెలవెల
- 816 చెరువుల్లో అలుగుపోస్తున్నవి పదహారే!
- భారీ వర్షాలు కురిస్తేనే వరి సాగయ్యేది!



ఖానాపురం మండలం దుంపిల్ల గ్రామ చెరువు పరిధిలో నెర్రెలుబారిన పొలం

సాక్షి, వరంగల్: వరి సాగుకు ఆలవాలంగా ఉన్న వరంగల్ జిల్లాలో ఈసారి చెరువుల కింద సాగు అన్నదాతల్లో గుబులు రేపుతోంది. ఈ వానాకాలంలో వరంగల్ జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటివరకు 1.10 లక్షల ఎకరాల్లోపే వరినాట్లు వేశారు. దాదాపు 35 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆయా ప్రాంతాల్లోని చెరువుల్లో ఆశించిన మేర నీరు వచ్చి చేరకపోవడంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. ఈ నెలాఖరు వరకు చూసి వరుణుడు కరుణిస్తే వరి నాట్లు ముమ్మరం చేయాలని భావిస్తున్నారు.

ఎండుతున్న పంటలు

ఇప్పటికే కొన్ని చెరువుల ఆయకట్టులో నీరందక వరి పైరు ఎండిపోతోంది. జిల్లాలోని 816 చెరువుల్లో కేవలం 16 మాత్రమే నిండి అలుగుపోస్తున్నాయి. 81 చెరువుల్లో ఇప్పటికీ 25 శాతం మేర నీరు కూడా చేరకపోవడం గమనార్హం. 296 చెరువుల్లో 25 నుంచి 50 శాతం వరకు, 319 చెరువుల్లో 51 నుంచి 70 శాతం వరకు నీరు చేరుకుందని నీటిపారుదల శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 62 చెరువుల్లో 73 నుంచి 100 శాతం నీరు చేరితే. 16 చెరువులు అలుగుపోస్తున్నాయని గణాంకాలు వెల్లడించాయి. మొత్తంగా 696 చెరువుల్లో ఆశించిన మేర నీరు లేకపోవడంతో అన్నదాతలు హైరానా చెందుతున్నారు.

వర్షాలు కురిస్తేనే..

జూన్‌లో 188.2 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 22 మిల్లీమీటర్లు తక్కువగా, జూలైలో 299.2 మిమీలు కురవాల్సి ఉండగా.. తొమ్మిది మీటర్లు తక్కువగా, ఆగస్టులో 588.6 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా.. 567.4 మి.మీలు కురిసిందని వాతావరణ విభాగాధికారులు చెబుతున్నారు. అయితే ఈ వర్షం అన్ని మండలాల్లో ఒక్క తీరుగా లేదని, ఆరు మండలాల్లో లోటు ఉండడం కూడా చెరువులు నిండకపోవడానికి కారణంగా కనిపిస్తోంది. ఈ నెలాఖరు వరకు భారీ వర్షాలు కురిస్తేనే చెరువులు నిండే పరిస్థితి కనిపిస్తోంది. లేకపోతే వరి సాగుకు గడ్డు పరిస్థితి కనిపించే అవకాశం ఉంది.

వర్షం పడకపోతే కష్టమే..



చంద్రుగొండ పెద్ద చెరువు పారకం కింద నాకు రెండెకరాల భూమి ఉంది. ప్రతీ సంవత్సరం ఈ సమయానికే వరి నాట్లు వేసేవాణ్ణి. ఈసారి ఇంకా పూర్తి స్థాయిలో చెరువు నిండలేదు. దీంతో దుక్కి దున్ని సిద్ధంగా ఉంచా. మరో వారంలో వర్షాలు కురవకపోతే వరి సాగు కష్టమే అవుతుంది. భూముల్ని బీడు వదిలేయాల్సి ఉంటుంది.

– తుంగ యాకస్వామి, చంద్రుగొండ, నెక్కొండ మండలం

అర్జీలను త్వరగా పరిష్కరించండి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ప్రజావాణికి 19 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారద, ఇతర అధికారులు

కాశిబుగ్గ సెంటర్: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్డీఓ పీడీ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణితో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. రాఖీ పౌర్ణమి పండుగ కావడంతో ప్రజావాణిలో 19 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేస్తూ.. మానవతా దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించలేని పక్షంలో దరఖాస్తుదారుడికి అర్థమయ్యేలా వివరించాలని, అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో మొత్తం 19 అర్జీలు వచ్చాయి. అందులో 7 వినతులు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి కాగా.. మిగతావి జీడబ్ల్యూఎంసీకి సంబంధించినవి 2, డీసీఎస్‌ఓ 1, వరంగల్ ఈస్ట్ డీసీపీ 1, ఎంజీఎం 1, డీఈఓ 1, డీఎంహెచ్‌ఓ 1, ఎస్సీ కార్పొరేషన్ 1, వ్యవసాయ శాఖ 2, డీపీఓ 1, నర్సంపేట ప్రభుత్వ దవాఖాన 1కి సంబంధించిన అర్జీలు సిఫారసు చేశారు. ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను ప్రజావాణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందని, వాటిని పెండింగ్‌లో ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తప్పు సవరించి పాస్ బుక్ ఇప్పించండి



దూపతండా పంచాయతీ పరిధిలో మా నాన్న పేరు మీద 4.6 ఎకరాల భూమి ఉంది. మా నాన్న పదేళ్ల క్రితం చనిపోయాడు. ధరణిలో తప్పుగా నమోదైంది.. కాబట్టి ఆ భూమి నాపేరు మీద చేసి పాస్ బుక్ ఇవ్వాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నా.

– ఒగ్గు దర్గయ్య, అన్నారం షరీఫ్

భూమి డబ్బులు ఇప్పించాలి..



నాకు భర్త, పిల్లలు ఎవరూ లేరు. వారసత్వంగా వచ్చిన భూమిని అమ్మాలని బయాన రూ.20 వేలు తీసుకున్నా. మిగతా డబ్బులు ఇవ్వకుండానే భూమిని కబ్జా చేసి ఇబ్బంది పెడుతున్నారు. నాభూమిలోకి నన్నే రానివ్వట్లేదు. డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్న.

– భూక్య కోటమ్మ, పన్యానాయక్ తండా

వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించండి



కాకతీయ మెడికల్ కాలేజీలో చదువుతున్న వైద్య విద్యార్థినులకు రక్షణ కల్పించాలి. విద్యార్థులు ఉండే హాస్టళ్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిఘా ఉంచాలి.

– అయిత ఉషాభాస్కర్, సేవా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి

విద్యుత్ తీగలు తెగిపడి ఆవులు మృతి



నల్లబెల్లి: గాలివాన బీభత్సంతో విద్యుత్ తీగలు తెగిపడి మండలంలోని కన్నారావుపేట గ్రామానికి చెందిన రైతు పల్నాటి మూర్తికి చెందిన రెండు పాడి జెర్సీ ఆవులు మృతి చెందాయి. మూర్తి జెర్సీ ఆవుల పాలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రెండు ఆవులను కుటుంబ సభ్యులు ఇంటి నుంచి మేతకు రాంతీర్థం శివారులోకి తీసుకెళ్లారు. సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సనికి విద్యుత్ వైర్లు తెగి ఆవుపై పడడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఆవులు మృతి చెందినట్లు బాధిత రైతు రోదిస్తూ తెలిపాడు. ఆవుల విలువ సుమారు రూ.1.60 లక్షలు ఉంటుందని, తమ కుటుంబం ఉపాధిని కోల్పోయిందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పార్టీల ప్రతినిధులతో సమావేశం

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలో 2025కు సంబంధించిన ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ జాబితా రూపకల్పన, సవరణను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని రాజకీయ నాయకులను కోరారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు, నవంబర్ 28 వరకు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 24 డిసెంబర్ 2024లోగా అభ్యంతరాలను ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా రూపొందించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలని, ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి ఓటర్ల నూతన ఫొటోలు అప్లోడ్ చేస్తారని పేర్కొన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు ఈవీ.శ్రీనివాస్, బాకం హరి శకంర్, ఫైజ్ ఉల్లా, శ్యామ్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాఖీ పండుగను పురస్కరించుకొని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



కోనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్‌కు చర్యలు

గీసుకొండ: మండలంలోని కోనాయమాకుల ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్‌కు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె మండలంలోని కోనాయమాకులలో 14 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎత్తిపోతల పథకంలో పంపులు, మోటార్లు, విద్యుత్ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి త్వరితగతిన ట్రయల్ రన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణను త్వరగా చేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట ఎస్ఆర్ఎస్పీ డీఈ రామకృష్ణ, ఏఈ కిరణ్మయి, డీటీ రవీందర్, ఎంపీఓ ప్రభాకర్, ఆర్ఐ సాంబయ్య తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీ అక్రమాలపై విజి'లెన్స్'

రూ.100 కోట్ల పనుల్లో అక్రమాలపై మళ్లీ ఆరా..

- పలువురు కాంట్రాక్టర్లు, అధికారులకు నోటీసులు..?
- డీబీఎం–48లో భారీ అక్రమాలు.. 2021లో ఓ ఇరిగేషన్ అధికారి ఫిర్యాదు
- ఏడాది పాటు సాగిన విచారణ.. మధ్యలోనే తప్పుకున్న ఓ డీఈ
- మళ్లీ తెరపైకి అక్రమాల బాగోతం.. ఇరిగేషన్ ఇంజినీరింగ్ వర్గాల్లో చర్చ



సాక్షిప్రతినిధి, వరంగల్: అవినీతి, అక్రమాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కొరడా ఝుళిపిస్తోంది. అసంపూర్తిగా మిగిలిన పాత కేసులను తిరగతోడుతోంది. అభివృద్ధి పనుల్లో అక్రమాలు.. ప్రభుత్వరంగ సంస్థల్లో అక్రమ నియామకాల అభియోగాలున్న వారిని మళ్లీ పిలిచి విచారిస్తోంది. ఇందులో భాగంగా 2021 సంవత్సరం ఎస్సారెస్పీ కాల్వల మరమ్మతులు, ఆధునికీకరణ పనుల్లో జరిగిన అక్రమాల ఫైలును బయటకు తీయడంపై ఇరిగేషన్ ఇంజినీరింగ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లకు నోటీసులు కూడా ఇచ్చారని ప్రచారం జరుగుతుండగా.. ఉన్నతాధికారులు ధృవీకరించడం లేదు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నట్లు సమాచారం.

పనులు కాకుండానే బిల్లుల చెల్లింపులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఇరిగేషన్ శాఖలో రూ.100 కోట్ల పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని, వీటిపై సమగ్ర దర్యాప్తు చేయాలని 2021 సంవత్సరంలో అప్పటి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి ఫిర్యాదు చేశారు. ఎస్.ఆర్.ఎస్.పి హన్మకొండ కన్‌స్ట్రక్షన్ సర్కిల్ డివిజన్ నంబర్ 4 పరిధిలోని తీగరాజుపల్లి, పర్వతగిరి, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం జిల్లాలోని తీర్థాల వరకు కాల్వల మరమ్మతులు, ఆధునికీకరణ పనులు రూ.123 కోట్ల ఖర్చుతో చేపట్టేందుకు 2018లో నిధులు మంజూరు చేశారు. వీటితో డీబీఎం 48, 1ఆర్ 2ఎల్, 3ఎఆర్, 6ఎల్, 10ఆర్, 1,13ఆర్, 16ఆర్, 17ఎల్, 21ఆర్, 24ఆర్, 25ఎల్, 26ఎల్, 27ఎల్, 28ఆర్, 29ఎల్, 30ఆర్, 31ఎల్, 32ఎల్, 34ఆర్, 35ఎల్, 26ఆర్, 38ఆర్ ఉప కాల్వల అభివృద్ధి, మట్టి పనులు, కాల్వ కట్టలు, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, ఈ పనులు చేయకుండానే కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై దాదాపు రూ.17కోట్ల పనులు జరిగినట్లుగా బిల్లులు రికార్డు చేసుకొని డబ్బులు డ్రా చేసుకున్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే శాఖలో పని చేసే ఓ అధికారి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అర్ధంతరంగా అటకెక్కిన విచారణ..

పెద్ద మొత్తంలో డబ్బులు దుర్వినియోగం చేయడంతో పాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా తనిఖీలు చేయకుండానే కాంట్రాక్టర్ల దగ్గర పర్సంటేజీలు తీసుకొని క్వాలిటీ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఫిర్యాదుదారులు అప్పట్లోనే ఆధారాలు కూడా సమర్పించారు. దాదాపు రూ.20 కోట్లతో పర్వతగిరి పెద్ద చెరువు పనులు కూడా నాణ్యత లేకుండా చేశారని, దీనిపై అక్కడ పనిచేసిన ఏఈ విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేస్తే కూడా తూతూ మంత్రంగా విచారణ సాగించారు. ఈ అక్రమాలపై విచారణాధికారి అయిన ఓ విజిలెన్స్ డీఈ (ఇరిగేషన్ శాఖకు చెందినవారే).. విచారణ జరిపినట్లే జరిపి అర్ధంతరంగా ఎటూ తేల్చకుండా తప్పుకున్నారు. దీనిపైనా కాంట్రాక్టర్ పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పారని అప్పట్లో అనేక ఫిర్యాదులు ఉన్నతాధికారులకు వెళ్లాయి. అలాగే డీబీఎం 38 ప్యాకేజీ పనులు గీసుకొండ, మల్లంపల్లి, పరకాల వరకు రూ.123 కోట్ల అంచనా వ్యయంతో బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్‌ల అభివృద్ధి కొరకు విడుదల చేసిన నిధుల్లో భారీ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు ఆదేశించినా.. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అప్పట్లో ఎటూ తేల్చ లేదు. అయితే పాత కేసులనూ తిరగదోడుతున్న క్రమంలో తాజాగా కొందరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి దృష్టికి తీసుకెళ్లగా.. ఎస్సారెస్పీ పనుల్లో అక్రమాల ఫైళ్ల బూజు దులుపుతుండటం ఇంజినీరింగ్‌వర్గాల్లో కలకలం రేపుతోంది.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- 'జూడా'ల దీక్షకు సంఘీభావం



'జూడా'ల దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఎంజీఎం: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంజీఎంలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరసన దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణకు ఎంజీఎంలో భద్రత మెరుగుపర్చాలని డీఎస్పీకి సూచించారు. అనంతరం ఎంజీఎంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళిని కోరారు. కేఎంసీలోని రోడ్ల నిర్మాణానికి వారం లోపు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థిని హత్యకు కారకులైన దుండగులను శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేసి, కేంద్ర రక్షణ చట్టం అమలు చేసే వరకు దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు ఎంజీఎం సూపరింటెండెంట్, పోలీస్ అధికారులు, జూనియర్ డాక్టర్లకు మహిళా జూనియర్ డాక్టర్లు రాఖీ కట్టారు.

'వెల్‌కమ్ టు నిట్ వరంగల్'



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ క్యాంపస్‌లో అడుగుపెట్టిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు 'వెల్‌కమ్ టు నిట్ వరంగల్' అంటూ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ సోమవారం స్వాగతం పలికారు. నిట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన నిట్ క్యాంపస్‌లో సీటు సాధించడమే తొలి విజయమని చెప్పారు. ఇక్కడ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

నిర్వాసితులకు పరిహారం అందించాలి

- డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి



మాట్లాడుతున్న తుమ్మల కుమారస్వామి

వర్ధన్నపేట: రోడ్డు వెడల్పులో భాగంగా వర్ధన్నపేటలో ఇళ్లు, ఖాళీ స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం అందించి ఆదుకోవాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం(డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో కుమారస్వామి మాట్లాడుతూ.. వర్ధన్నపేట అభివృద్ధిలో భాగంగా వర్ధన్నపేట బస్టాండ్ నుంచి ఎస్సీ కాలనీ వరకు, గతంలో వర్ధన్నపేట–జఫర్‌గడ్ ప్రధాన రహదారి వెంట పిరంగిగడ్డ వరకు ఇళ్లు, ఖాళీ స్థలాలు కోల్పోయి ఎందరో నిర్వాసితులయ్యారన్నారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో సామాన్యుల ఆస్తులకు నష్టం కలిగించడం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్లు, ఖాళీ స్థలాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందుకోసం బాధితులతో కలిసి ఈనెల 23న వర్ధన్నపేటలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును సైతం ఆహ్వానించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కంజర్ల సమ్మయ్య, చల్లా మిధున్, మునిగాల అరుణ్, బరిగెల బాబు, కందికట్ల తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీగంధం చెట్ల నరికివేత


నరికివేసిన చెట్లను చూపుతున్న దంపతులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి చంద్రు తండాలో మాలోతు సుశీల, భద్రు దంపతులు పది సంవత్సరాల క్రితం తమ రెండు ఎకరాల భూమిలో శ్రీగంధం మొక్కలు నాటగా ప్రస్తుతం చెట్లు అయ్యాయి. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన రాత్రి దుండగులు సుమారు రూ. 20 లక్షల విలువైన చెట్లు నరికివేశారని ఆ దంపతులు సోమవారం తెలిపారు. చెట్లు నరికివేసిన దుండగులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై మానుకోట రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

పాము కాటుతో పీఎస్ మృతి


కృష్ణ (ఫైల్)

తరిగొప్పుల : పాము కాటుతో ఓ పంచాయతీ సెక్రటరీ (పీఎస్) మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన చింతల కృష్ణ(30) మండలంలోని సోలిపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, బోనాల పండుగ నిమిత్తం ఆదివారం కుటుంబంతో కలిసి సిద్దిపేట జిల్లా మద్దూరులో బంధువుల ఇంటికి వెళ్లాడు. రాత్రి భోజనం చేసి చేతులు కడుక్కోవడానికి వెళ్తున్న క్రమంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

చేపల వ్యాపారి ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

హసన్‌పర్తి: మద్యం మత్తులో హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన చేపల వ్యాపారి పిట్టల రమేశ్(48) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై దేవేందర్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ. 2 లక్షల విలువైన ఆస్తి నష్టం

జనగామ రూరల్ : షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం జనగామలో చోటుచేసుకుంది. పట్టణంలోని గణేశ్ వాడకు చెందిన అవదూత శంకర్, పద్మ దంపతులు రాఖీ కట్టేందుకు జఫర్‌గఢ్ మండలం షాపల్లిలో తోబుట్టువు ఇంటికి వెళ్లారు. సాయంత్రం వేళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి కుట్టుమిషన్లు, నూతన వస్త్రాలు, కుట్టిన దుస్తులతోపాటు ఇంటి సామగ్రి దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక వాహనం హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పేసింది. ఈఘటనలో సుమారు రూ. 2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు షురూ..

- 67 మంది అభ్యర్థులు మొదటి కేటగిరీ నుంచి రెండో కేటగిరీలోకి మార్పు..
- అడ్మిషన్ల లెటర్లు అందజేస్తున్న డీన్లు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని సోషల్ సైన్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్ట్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. గతంలో పీహెచ్‌డీ మొదటి కేటగిరీలో మిగిలిన 67 సీట్లను రెండో కేటగిరీలోకి మార్పు చేశారు. 2021–2022లో నోటిఫికేషన్ ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఫలితాల అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించిన మెరిట్ జాబితా నుంచి అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఏఏ విభాగంలో సీట్లు ఎన్ని ఉన్నాయో ఆయా విభాగాల డీన్లు మెరిట్ జాబితాలోని అభ్యర్థులకు ప్రొవిజనల్‌గా అడ్మిషన్ల లెటర్లను అందజేసే ప్రక్రియ షురూ చేశారు. సైన్స్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఓ అభ్యర్థికి పీహెచ్‌డీ అడ్మిషన్ లెటర్ అందజేశారు. అలాగే, సోషల్ సైన్స్‌విభాగం ఎంటీఎంలో ముగ్గురికి, ఎకనామిక్స్‌లో ఒకరికి, సోషియాలజీలో ఇద్దరికి సోషల్‌సైన్స్ డీన్ మనోహర్.. పీహెచ్‌డీ అడ్మిషన్ల లెటర్లు అందజేశారు.

విభాగాల వారీగా వేకెన్సీల వివరాలు..

ఇంగ్లిష్ 1, కామర్స్‌బిజినెస్‌మేనేజ్‌మెంట్ 1, ఈసీఈ 7, సివిల్ ఇంజనీరింగ్ 1, మెకానికల్ ఇంజనీరింగ్ 1, ఫార్మసీ 15, బయోటెక్నాలజీ 2, కెమిస్ట్రీ 2, కంప్యూటర్‌సైన్స్ 5, జియాలజీ 1, మ్యాథ్‌మెటిక్స్ 7, మైక్రోబయాలజీ 6, ఫిజిక్స్ 4, జువాలజీ 6, ఎకనామిక్స్ 1, ఎంటీఎం 3, సోషియాలజీ 2.. మొత్తం 67 మంది అభ్యర్థులకు ఆయా డీన్లు పీహెచ్‌డీ అడ్మిషన్ల లెటర్లు ఇస్తున్నారు.

మార్చి31 వరకు వేకెన్సీల గుర్తింపు

కేయూలోని ఆయా విభాగాల్లో 2021–2022 పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చాక అప్పటి నుంచి ఈఏడాది మార్చి 31వ తేదీ వరకు పీహెచ్‌డీ–2 కేటగిరీలో ఎన్ని వేకెన్సీలు ఉన్నాయో గుర్తించి జాబితా పంపాలని సోషల్ సైన్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఆర్ట్స్, కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్, లా, ఫార్మసీ విభాగాల డీన్లు సంబంధిత విభాగాల అధిపతులకు ఈనెల 17న లేఖలు పంపారు. విభాగాల వారీగా ఏఏ అధ్యాపకుల వద్ద ఎన్ని పీహెచ్‌డీ సీట్లు వేకెన్సీలు ఉన్నాయో వివరాలు పంపాల్సింటుంది. ఇప్పటికే పీహెచ్‌డీ అడ్మిషన్ కలిగి ఉండి ఆరేళ్లు పూర్తయితే ఆయా సీట్లను కూడా వేకెన్సీలుగా చూపాల్సింటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 4, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 6, ప్రొఫెసర్‌కు 8 మంది చొప్పున గైడ్‌షిప్ ఇచ్చేందుకు యూజీసీ నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ అడ్మిషన్లకు అవకాశం ఉంటుంది. కొత్తగా ఎవరికైనా పీహెచ్‌డీ గైడ్‌షిప్ వస్తే ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇద్దరికి మాత్రమే అడ్మిషన్లకు అవకాశం ఉంటుంది. అలాగే, అప్పటి నోటిఫికేషన్ నాటికి 65 ఏళ్లలోపు వయసు కలిగిన రిటైర్డ్ ఆచార్యులకు కూడా గైడ్‌షిప్‌నకు అవకాశం ఇచ్చారు. అయితే ఆయా ఆచార్యుల కాన్సెంట్ తీసుకుని మాత్రమే వేకెన్సీలు చూపాల్సింటుందని డీన్లు విభాగాల అధిపతులకు లేఖలు పంపారు. ఈనెల 22వరకు వేకెన్సీల జాబితా విభాగాల అధిపతులు డీన్లకు పంపాల్సింటుంది. ఆ తరువాత ఆయా వేకెన్సీలో ఇప్పటికే ఉన్న మెరిట్ జాబితా నుంచే అడ్మిషన్లు కల్పిస్తారు. ఈ ప్రక్రియ అంతా వారం రోజుల్లోనే పూర్తిచేయాల్సింటుంది. 150 నుంచి 200 వరకు పీహెచ్‌డీ సీట్లు వేకెన్సీలుగా ఉండే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

పరిశోధనల్లో నాణ్యత పెరగాలి

- విద్యార్థుల్లో నమ్మకం కల్పించాల్సింది వర్సిటీలే
- హైదరాబాద్ వర్సిటీ ప్రొవైస్ చాన్స్‌లర్ రాజశేఖర్


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్, పాలకమండలి సభ్యులు



మాట్లాడుతున్న హైదరాబాద్ వర్సిటీ ప్రొవైస్ చాన్స్‌లర్ రాజశేఖర్

కేయూ క్యాంపస్: ఉన్నత విద్యలో క్వాలిటీ ముఖ్యమని, పరిశోధనల్లో నాణ్యత పెరగాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల్లో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత యూనివర్సిటీలదేనని హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొవైస్ చాన్స్‌లర్, సీనియర్ మేనేజ్‌మెంట్ ఆచార్యుడు బి. రాజశేఖర్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ 48వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం కేయూ పరిపాలన భవనంలోని సెనేట్‌హాల్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విస్తృతోపన్యాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'న్యాక్ అక్రిడిటేషన్ ర్యాంకింగ్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ప్రసంగించారు. విద్యార్థులు కళాశాలల ఎంపిక, ప్రాంగణ నియామకాలు, మౌలిక వసతులు చూస్తున్నారన్నారు. నైపుణ్యాలు పెరిగేందుకు విశ్వవిద్యాలయాలు కృషిచేయాలన్నారు. పరిశ్రమలతో సంబంధబాంధవ్యాలు కొనసాగించాలన్నారు. ఉన్నత విద్యలో క్వాలిటీ ముఖ్య వస్తువు అయిందన్నారు. చాలా సంస్కరణలు వస్తున్నాయన్నారు. అయినా పాత విధానాల్లో ఉన్నామన్నారు. నేటి అధ్యాపకుడికి పోటీగా యూట్యూబ్ కూడా వచ్చిందన్నారు. అవకాశాలను పట్టుకోవటమే తరువాయి అన్నారు. సిద్ధాంతగ్రంథాలతోపాటు మంచి పరిశోధన సమర్పించాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. 46 సంవత్సరాల్లో కేయూ చేరుకున్న విజయాలు, విశ్వవిద్యాలయం అంచలంచెల అభివృద్ధిని వివరించారు. కేయూ పాలకమండలిసభ్యులు మల్లం నవీన్, పుల్లూరి సుధాకర్, చిర్ర రాజు, కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వడ్డె రవీందర్, హిస్టరీ విభాగం ఇన్‌చార్జ్ అధిపతి చిలువేరు రాజ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలశంకర్, మందవీరస్వామి,శివకుమార్.. యూనివర్సిటీ అభివృద్ధి లోటుపాట్ల గురించి వివరించారు. నాలుగు వారాల శిక్షణలో బోధనేతర ఉద్యోగుల సందేశాత్మక అంశాలతో పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్ సంయోజకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిడ్డా! కల్లు గీసి ఇప్పుడే వస్తా..

- చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి
- పండుగ వేళ జయగిరిలో విషాదం


సదానందం(ఫైల్)

హసన్‌పర్తి: 'బిడ్డా! కల్లు గీసి ఇప్పుడే వస్తా! వచ్చాకే రాఖీ కట్టుకుంటా' అంటూ వెళ్లిన తండ్రి ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి విగతజీవుడయ్యాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగాని సదానందం (55)కు కుమారుడు సుమన్, కూతురు నవల ఉన్నారు. కూతురును స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పల్లగుట్టకు చెందిన ఓ యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. అయితే రాఖీ పండుగ సందర్భంగా సోదరుడు సుమన్‌తో పాటు తండ్రి సదానందంకు రాఖీ కట్టడానికి సోమవారం నవల జయగిరికి వచ్చింది. బిడ్డా బాగోగులు తెలుసుకున్న తండ్రి సదానందం .. కల్లు గీసి వస్తా? అంటూ మోకు కట్టుకుని బయల్దేరాడు.. కల్లుగీసి చెట్టు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై దేవేందర్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్రాలు లేని వాహనాలపై చర్యలు

- ఎంవీఐ జైపాల్‌రెడ్డి వెల్లడి
- ధ్రువీకరణ పత్రాలు లేని లారీ పట్టివేత


అధికారులు పట్టుకున్న లారీ

ఖిలా వరంగల్: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నడిచే వాహనాలపై చర్యలు తీసుకుంటామని ఎంవీఐ జైపాల్‌రెడ్డి హెచ్చరించారు. వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా వెళ్తున్న లారీని పట్టుకుని ఆర్టీఏ కార్యాలయానికి తరలించామని తెలిపారు. ఈ మేరకు సోమవారం వరంగల్ జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ ఎంవీఐ శోభన్‌బాబుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఏపీ 35 యూ4777 నంబర్ గల లారీ ఏపీ 16 టీబీ 1399 నంబర్ ప్లేట్‌ను బిగించుకుని శనివారం రాత్రి వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ సమీపం నుంచి యూరియా లోడ్‌తో వరంగల్ జిల్లా ఖానాపురం వెళ్తోంది. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు ఫాస్ నంబర్‌తో ఈ లారీని గుర్తించి సీజ్ చేసి ఆర్టీఏ కార్యాలయానికి తరలించామని చెప్పారు. ఒకే రిజిస్ట్రేషన్‌తో రెండు, మూడు వాహనాలు వేర్వేరు చోట్ల జమ్మికుంట, వరంగల్, హుజూరాబాద్, మహబూబాబాద్, జనగామ తదితర చోట్ల గుట్టుగా తిరుగుతున్నాయని తెలిపారు. అసలు రిజిస్ట్రేషన్ నంబర్ ఒక్కటే ఉంటుందని, దీని ఆధారంగా వాహన యజమానులు మరో రెండు, మూడు వాహనాలు నడుపుతున్నారని చెప్పారు. ఫాస్ నంబర్ పరిశీలిస్తే ఈ దందా బయటపడిందని చెప్పారు. ఒకే రిజిస్ట్రేషన్‌పై రెండు లారీలు వేర్వేరు చోట్ల తిరుగుతున్న లారీలను పట్టుకున్నామని తెలిపారు. తప్పుడు ధ్రువపత్రాలతో తిరిగే లారీలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్టీఏ కానిస్టేబుళ్లు,సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ సిబ్బంది



ఆస్పత్రిలో బాధితుడికి సెల్‌ఫోన్‌లు, నగదు అందజేస్తున్న డిపో సిబ్బంది

నర్సంపేట: వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్ 24జెడ్ 0023 నంబర్ ఎక్స్‌ప్రెస్ బస్సు ఆదివారం హనుమకొండ నుంచి నర్సంపేటకు బయలుదేరింది. నర్సంపేట బస్టాండ్‌కు సాయంత్రం చేరుకుంది. 4 గంటల సమయంలో బస్సులోని ప్రయాణికులంతా దిగిపోగా ఓ యువకుడు మాత్రం కూర్చున్న సీటులోనే ఫిట్స్ వచ్చి కొట్టుమిట్టాడుతూ పడిపోయాడు. ఆన్ డ్యూటీలో ఉన్న కండక్టర్ మంద రాజు అప్రమత్తమై 108 సిబ్బందికి, డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న ఓ డాక్టర్ స్పందించి ఫిట్స్‌తో ఉన్న ఆ యువకుడికి వెంటనే ప్రథమ చికిత్స అందించాడు. అంబులెన్స్ ఆలస్యం కావడంతో డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి సూచన మేరకు అదే బస్సులో పోలీసులు, డీఐ తోటకూరి వెంకటేశ్వర్లు, డ్రైవర్ కేఎస్.గౌడ్, కండక్టర్ మంద రాజు అతడిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడారు. కండక్టర్ మంద రాజు, డ్రైవర్ కేఎస్.గౌడ్‌ను డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అభినందించారు. కాగా ఆ యువకుడిది మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన పేరుపుగొండ అజయ్‌గా గుర్తించిన ఆర్టీసీ అధికారులు అతడి వద్ద లభించిన రెండు రూ.40వేల విలువైన సెల్‌ఫోన్‌లు, కొంత నగదును అతడి బంధువులకు అప్పగించారు.

ఫొటోగ్రఫీలో శ్రావణ్‌కు రాష్ట్ర మొదటి అవార్డు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రావణ్


గృహజ్యోతి విభాగంలో మొదటి బహుమతి గెలుచుకున్న ఫొటో ఇదే

వెంకటాపురం(ఎం): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో గృహజ్యోతి విభాగం నుంచి ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేటకు చెందిన తడాండ్ల శ్రావణ్ మొదటి స్థానంలో నిలిచి అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ గ్రీన్‌పార్క్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ హనుమంతురెడ్డి చేతుల మీదుగా శ్రావణ్ అవార్డుతో పాటు రూ.20వేల నగదు పురస్కారం అందుకున్నారు.

కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రం చేయాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి
- పలు రైల్వే సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేత


రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

కాజీపేట రూరల్/ధర్మసాగర్ : కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రం చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ మేరకు సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు రైల్వే సమస్యలు, అభివృద్ధి పనులపై జీఎంకు ప్రస్తావించి వినతిపత్రం అందజేశారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. కాజీపేట జంక్షన్‌లో ప్లాట్‌ఫామ్‌లు విస్తరించి కాజీపేట, వరంగల్ స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కాజీపేట టౌన్ స్టేషన్‌లో రైళ్లకు హాల్టింగ్ కల్పించి కాజీపేట రైల్వే సబ్ డివిజన్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని పెంచాలన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ కల్పించాలన్నారు. నష్కల్ నుంచి హసన్‌పర్తి, నష్కల్ నుంచి చింతలపల్లి వరకు రెండు మార్గాల్లో రైల్వే బైపాస్ లైన్ల నిర్మాణంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, మరోవైపు వరంగల్ నగరం గుండా వెళ్లే రైల్వే బైపాస్ మార్గంతో నగరాభివృద్ధికి అడ్డంకిగా మారే ప్రమాదం ఉందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా అలైన్‌మెంట్‌లో మార్పుచేసి మరో మార్గంలో రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించి ఈ సమస్యలపై సమీక్షించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి తెలిపారు.

నలుగురు గంజాయి విక్రయదారుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన పర్వతగిరి సీఐ రాజగోపాల్


వివరాలు వెల్లడిస్తున్న పర్వతగిరి సీఐ రాజగోపాల్, పక్కన సంగెం ఎస్సై నరేశ్

సంగెం: జల్సాలకు అలవాటు పడి ఈజీగా డబ్బులు సంపాదించాలని గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 430 గ్రాముల సరుకు స్వాధీనం చేసుకున్నామని పర్వతగిరి సీఐ రాజగోపాల్ తెలిపారు. ఈమేరకు సోమవారం సంగెం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సంగెం ఎస్సై నరేశ్ ఆదివారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రామచంద్రాపురం శివారులో ఇదే గ్రామానికి చెందిన మైదం అశ్విన్, జన్ను అరవింద్, లోహితకు చెందిన ల్యాదల్ల తరుణ్‌తో పాటు మరో మైనర్.. పోలీసులకు చూసి పారిపోతుండగా పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద 430 గ్రాముల ఎండుగంజాయి లభించగా విచారించారు. గవిచర్ల క్రాస్ రహమత్‌నగర్‌కు చెందిన అప్సర్ అలియాస్ లడ్డు వద్ద కొనుగోలు చేసి ప్యాకెట్ల రూపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో నలుగురిని అరెస్ట్ చేసి గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ రాజగోపాల్ పేర్కొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


జంపన్న చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ములుగు రూరల్: స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవలో ముందుండాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జంపన్న చారిటబుల్ ట్రస్ట్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి అవకాశాల కోసం మహిళలు, యువతకు శిక్షణ అందించాలన్నారు. ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ముందు జిల్లాకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకకు వెళ్తూ పరలోకాలకు..

- టాటా ఏస్ బోల్తా.. ఒకరి దుర్మరణం
- ముగ్గురికి గాయాలు
- గాంధీపురంలో ఘటన


యుగంధర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : గృహప్రవేశ వేడుకకు వెళ్తున్న క్రమంలో టాటా ఏస్ వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురంలో చోటుచేసుకుంది. రూరల్ ఏఎస్సై పెద్దిరెడ్డి రమేశ్ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో స్టీల్ షాపు నిర్వహించే కాటి యుగంధర్ (46) తన బాబాయి నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొనేందుకుగాను ఉదయం 6 గంటలకు కుటుంబీకులతో కలిసి టాటాఏస్‌లో తొర్రూరు బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురంలో ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టును ఢీకొని అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు సీట్లో కూర్చున్న యుగంధర్ కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న అతడి తండ్రి వీరస్వామి, బంధువులు సందీప్, వికాస్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రూరల్ ఏఎస్సై సూరయ్య ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు యుగంధర్ తండ్రి వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్సై పెద్దిరెడ్డి రమేశ్ తెలిపారు. మృతుడికి భార్య రమణ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు
- మీదికొండ క్రాస్ వద్ద ఘటన


నరేశ్(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఓ ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని మీదికొండ క్రాస్ సమీపం జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మీదికొండకు చెందిన పసుల నరేశ్(26) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పనిమిత్తం ఇదే గ్రామానికి చెందిన మరోమేస్త్రీ కొత్తూరు ఏసుతో కలిసి బైక్‌పై మీదికొండ నుంచి రాఘవాపూర్‌కు బయలుదేరారు. మీదికొండ క్రాస్ నుంచి రాఘవాపూర్‌కు వెళ్లే క్రమంలో జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్లారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మధ్యభాగం సైడ్ నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో నరేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, ఏసుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

అక్రమ కేసు పెట్టారని..

- వ్యక్తి బలవన్మరణం
- మృతదేహంతో నిరసనకు యత్నం
- కాటారంలో ఘటన


బాపు (ఫైల్)

కాటారం : ఓ మహిళ తన కూతురును వేధించాడని తనపై అక్రమంగా పోక్సో కేసు పెట్టారనే అవమానంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కాటారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బొమ్మనవాడకు చెందిన కొండగొర్ల బాపు(46) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ మహిళ తన కూతురుతో అసభ్యకరంగా ప్రవర్తించి వేధించాడని ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు బాపుపై పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన బాపు.. ఈ నెల 18న పురుగుల మందు తాగాడు. అనంతరం కాలనీలో తిరుగుతూ గట్టయ్య, శంకరమ్మ అనే వారు ఓ మహిళతో తనపై తప్పుడు కేసు పెట్టించారని, నేను ఎలాంటి తప్పు చేయలేదని, నా ఆత్మహత్యకు వారే కారణమని కాలనీవాసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిని గమనించిన కుటుంబీకులు వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

న్యాయం చేయాలని డిమాండ్..

బాపు ఆత్మహత్యకు గట్టయ్య, శంకరమ్మలే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వారి ఇళ్ల ఎదుట ఉంచి ఆందోళనకు సిద్ధమయ్యారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిని గమనించిన పోలీసులు కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని తమ ఇంటికి తరలింపజేశారు. బాధ్యులపై కేసు నమోదు చేసి న్యాయం జరిగేలా చూస్తామని సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్ వారికి హామీ ఇచ్చారు.